క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సరస్వతీమాత పూజలు

సూరేపల్లి(భట్టిప్రోలు): వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌లో వీణాపాణి సరస్వతీదేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సేవకులు ధారా నారాయణమూర్తి, బాలవికాస్ గురువు ధారా గిరిజలు మాట్లాడుతూ మాఘ మాసంలో వచ్చే శుక్లపక్ష పంచమిని వసంత పంచమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు పేర్కొన్నారు. మన జీవితాలను జ్ఞానంతో నింపే మాతృశక్తి సరస్వతీదేవి అని అన్నారు. విద్యార్థుల చేత సరస్వతీ అష్టోత్తర పూజ నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, చాక్లెట్లు అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

రేపల్లె రూరల్: పట్టణంలోని వివిధ వార్డులలో ఖాళీలు ఏర్పడిన 17 వలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు మున్సిపల్ కమిషనర్ రామబోపాల్‌రెడ్డి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 20, 21 తేదీలలో దరఖాస్తుల పరిశీలన, 22, 23 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 24న నియామక పత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైభవంగా వసంత పంచమి పూజలు



చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగాంబిక సమేత ఆనందీశ్వర స్వామి దేవస్థానంలో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకుడు ప్రయాగ రాంబాబు శర్మ ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు తమ చిన్నారులతో అమ్మవారిని దర్శించుకుని అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ, ఆలయ చైర్మన్ ఓగిరాల వీరాస్వామి, ఉల్లంగుంట శివరామకృష్ణ, భట్టు తిరుమల తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

చుండూరు(భట్టిప్రోలు): ఇటీవల నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హైస్కూల్లో చదువుతున్న ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. 60 మీటర్ల విభాగంలో జి. రాకేష్‌రెడ్డి, 600 మీటర్ల విభాగంలో షేక్ ఖాజాలు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు వేమూరు శరత్‌బాబు తెలిపారు.

శిలువ శ్రమానుభవ ధ్యానాలు ప్రారంభం

భట్టిప్రోలు: ఆంధ్ర సావార్తిక లూథరన్ సంఘం (క్రీస్తు లూథరన్ దేవాలయం) భట్టిప్రోలు ప్యారిష్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి క్రీస్తు ప్రభువు శిలువ శ్రమానుభవ ధ్యానాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి ఆరాధన నిర్వహించారు. ఈ ధ్యానాలు మార్చి 30వరకు జరుగుతాయని గురుమండల అధ్యక్షుడు, డిప్యూటీ బిషప్, తూర్పు గుంటూరు సినడ్ రెవరెండ్ రవీంద్రవర్మ దాసరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, ఏఈఎల్‌సీ యూత్, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్ విజయవంతానికి పిలుపు

భట్టిప్రోలు: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ శనివారం చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు జి. బాలాజీ, ఎం.సత్యన్నారాయణ, ఎం. వెంకట్రావులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టపెడుతుందని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలనే డిమాండ్లతో జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్ లో రైతులు, ప్రజలు, కార్మికులు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు జి. నాగరాజు, మనోజ్, కె.రామకోటేశ్వరరావు, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బేతపూడి క్రీడాకారులు.. మట్టిలో మాణిక్యాలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- విశాఖలో జరిగిన ఆడుదాం ఆంధ్రాలో గెలుపొందిన వాలీబాల్ జట్టు క్రీడాకారులకు సన్మానం



బేతపూడిలో వాలీబాల్ కోర్టు నిర్మాణానికి ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

బాపట్ల అర్బన్: బేతపూడి క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలని ఎమ్మెల్యే కోన రఘుపతి కొనియాడారు. ఈ నెల 13న విశాఖలో జరిగిన ఆడుదాం ఆంధ్రా స్టేట్ లెవెల్ పోటీల్లో వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ మొదటి స్థానంలో నిలిచిన బాపట్ల మండలం బేతపూడి జట్టును ఎమ్మెల్యే కోన అభినందించారు. రాష్ట్రంలోనే బాపట్ల జిల్లాకు పేరు తెచ్చిన ప్రతి క్రీడాకారుడిని సన్మానించారు. ఇలాగే మరెన్నో మ్యాచ్‌లు ఆడి బాపట్లకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ఎలాంటి సహాయం కావాలన్నా అడగాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు నగదు బహుమతులను అందించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడం కోసమే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పెట్టారని ఎమ్మెల్యే కోన అన్నారు. ఆటలు, ఆరోగ్యం, వ్యాయామం పట్ల అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోకిల రాఘవరెడ్డి, బేతపూడి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందివ్వాలి

ఎమ్మెల్యే కోన రఘుపతి



డిపాజిటర్స్ కౌంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంకులు కృషి చేయాలని ఆ దిశగా బాపట్ల కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బ్యాంకు ఆధునీకరణ పనులను బుధవారం పరిశీలించిన ఎమ్మెల్యే నూతనంగా ఏర్పాటు చేసిన డిపాజిటర్స్ కౌంటర్‌తో పాటు లాకర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నమ్మకానికి మారుపేరుగా బ్యాంకు ఖాతాదారులకు విస్తృత సేవలు అందిస్తుందన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ గర్నెపూడి వెంకటేశ్వరరావు, సహకారశాఖ అధికారి రవి, బ్యాంకు డైరెక్టర్లు కోటి ఉమామహేశ్వరరావు, బొమ్మిశెట్టి హరనాధ మురళి, బి. సంగమేశ్వరశాస్త్రి, ఇనుప గోళ్ల రంగారావు, ఆనంద్ , బ్యాంకు సెక్రటరీ గోపాల్, అడ్వకేట్ పులిపాక రఘురామ్, బ్రాహ్మణ సమాఖ్య ప్రెసిడెంట్ హరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన జీవ ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం



ధ్వజ స్థంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

చెరుకుపల్లి: గంగా పార్వతి సమేత శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థానం నందు గురువారం నూతన జీవ ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ దుంపా ప్రసాదరావు తెలిపారు. ధ్వజస్థంభ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం ఉదయం హోమగుండ పూజ అనంతరం ధ్వజస్థంభానికి సహస్ర ప్రతిష్ఠాచార్య బ్రహ్మశ్రీ స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం జరిగే నూతన జీవ ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంతో పాటు అన్న సమారాధన కార్యక్రమానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ, ఆలయ ప్రధాన అర్చకుడు చావలి జనతారావు, భక్తులు పాల్గొన్నారు.

లేగ దూడల సంరక్షణతోనే పాడి పరిశ్రమ అభివృద్ధి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు



లేగ దూడల అందాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న హనుమంతరావు

బాపట్లటౌన్: లేగ దూడల సంరక్షణతోనే పాడిపరిశ్రమ అభివృద్ధి చెందుతుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎం. హనుమంతరావు తెలిపారు. మండలంలోని పూండ్ల గ్రామంలో బుధవారం జిల్లా పశుగణాభివృద్ధి, జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో లేగ దూడల అందాల ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ లేగ దూడలను సంరక్షించినప్పుడే పాడి పరిశ్రమకు అవసరమైన గేదెలు అభివృద్ధి చెందుతాయన్నారు. లేగ దూడల సంరక్షణలో సరైన మెలుకువలను పాటించాలన్నారు. అనంతరం ఉత్తమ లేగదూడల యజమానులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఉప సంచాలకులు వై. కేదారేశ్వర్, పూండ్ల సర్పంచ్ నన్నం నరసింహారావు, బాపట్ల సహాయ సంచాలకులు డాక్టర్ టి. శంకర్‌రావు, పశువైద్యాధికారులు గోపికృష్ణ, రేచల్ దివ్య, ఎస్. సాహితీ, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యువత సన్మార్గం వైపు పయనించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

బాపట్ల అర్బన్ : ప్రేమికుల దినోత్సవం వికృతం కాకూడదని జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం నాయకులు కోటా వెంకటేశ్వర రెడ్డి యువతను కోరారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఊరూరా జన విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా వెదుళ్ళపల్లి చైతన్య భవన్‌లో బుధవారం సాయంత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'మానవుడే మహనీయుడు' అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రేమ ఒక మధురానుభూతి, పెళ్లి ఒక సామాజిక బంధమన్నారు. ప్రేమ,స్నేహం ఆకర్షణల మధ్య తేడాలను నేటి యువత తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం నేటి యువతపై ఉందన్నారు. సమావేశంలో షేక్ సుభాని, కావూరి చంద్రారెడ్డి నక్క వీరయ్య, షేక్ యాసిన్, కె.రాజు, బ్రహ్మారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సినిమా షూటింగ్ ప్రారంభం



క్లాప్‌నిస్తున్న సాదు చలపతి

తెనాలి: పట్టణానికి చెందిన కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో సీకే మీడియా పతాకంపై తీస్తున్న బాలల సినిమా షూటింగ్ బుధవారం స్థానిక గాంధీఇర్విన్ పార్కులో ప్రారంభమైంది. సూపర్‌స్టార్ బాల నటుడు కేజీఎఫ్ భానుప్రకాష్, కె.గోము, బెల్లంకొండ వెంకట్ పాత్రధారులపై తొలి సన్నివేశాన్ని చిత్రీకరించారు. పూజాకార్యక్రమాన్ని గొల్లపూడి ఉమాశంకర్ నిర్వహించగా, సాదు చలపతి క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. తదుపరి అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి వీరయ్య, కనపర్తి మధుకర్, శశికిరణ్, శేఖర్, సోమేష్, రాయుడు, జీవన్‌శ్రీ, నాగేశ్వరరావు, దేవిశెట్టి కృష్ణారావు, రజిని, వసంతయామిని, తులసిలపై కీలకమైన సన్నివేశాన్ని చిత్రీకరించారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ విద్యావ్యవస్థ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం బాగా రావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. బాలల సినిమా తీసేందుకు ముందుకొచ్చిన చిత్ర నిర్మాతలు అమిరినేని వెంకటప్రసాద్, సాదు సుస్మిత, కన్నెగంటి రవిని అభినందించారు. పట్టణ కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, స్థానిక కళాకారులు, దర్శకులు బడుగు మోహనరావు, మేరుగ సంజీవరావు, ముట్లడి ప్రకాష్, నవీన్ తదితరులు చిత్రబృందాన్ని అభినందించారు. తొలుత నాట్యాచారిణి ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం నృత్యాలను ప్రదర్శించింది. సినిమాకు డీఓపీలుగా రమేష్, భాస్కర్, ఆర్ట్ డైరెక్టర్లుగా ఎం.వెంకట్, కె.శ్రీను, మేకప్, కాస్ట్యూమ్ డిజైనర్ వెనిగళ్ల వెంకటేశ్వరరావు (సురభి), స్టిల్స్ డి.మధు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కనపర్తి రత్నాకర్. కార్యక్రమాన్ని ఎం.శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, సంజయ్ పర్యవేక్షించారు.

బ్యూటీషియన్ కోర్సులను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: బ్యూటీషియన్ కోర్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి మారుతీరామ్ పేర్కొన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. నగర కార్యదర్శి త్రిపురమల్లు హనుత్ ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా భావనాఋషి కల్యాణం



రేపల్లె రూరల్: మాఘశుద్ధ పంచమిని పురస్కరించుకుని భద్రావతి సమేత భావనా ఋషి స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రేపల్లె పట్టణంలోని ఓల్డ్‌టౌన్, ఇసుకపల్లి, మండలంలోని పేటేరులో వేంచేసియున్న భద్రావతి సమేత భావనాఋషి స్వామి ఆలయాలలో వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనము, కలశ స్థాపన అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను వైభవంగా చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఆయా ఆలయాల కమిటీల సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్ పరిశీలన

సూరేపల్లి(భట్టిప్రోలు): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ చైతన్య చక్రవర్తి పేర్కొన్నారు. బుధవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రతి నెలా వైద్యులు గ్రామానికి వచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వరుని ఆలయ ప్రారంభోత్సవం

అబ్బనగూడవల్లి(వేమూరు): మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలో శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. గురు వారం నుంచి సోమవారం వరకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గురువారం గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 19న సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పక్షుల కేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

పెదకాకాని: పక్షుల కేంద్రాన్ని ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఒరిస్సా రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీ ఆశిష్ కుమార్ జీనా అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని బుధవారం ఒరిస్సా రెవెన్యూశాఖ అడిషనల్ సెక్రటరీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆశిష్ కుమార్ జీనా మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నటువంటి పక్షుల కేంద్రాల్లో ఉప్పలపాడు పక్షుల కేంద్రం ప్రసిద్ధిగాంచిందన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ పక్షులు సేదతీరడం అభినందనీయమన్నారు. పక్షుల కేంద్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన అటవీశాఖ పనితీరు బాగుందని కితాబిచ్చారు. పక్షుల కేంద్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను చైర్మన్ పి అనిల్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో పక్షుల కేంద్రం చైర్మన్ పెరుమాళ్ళ అనిల్ కుమార్, డీఆర్ఓ వెంకటేశ్వరరావు, బీటు అధికారి సంతోష్‌లు పాల్గొన్నారు. ఆశిష్ కుమార్ జీనాకు పక్షుల కేంద్రం లోగోతో ఉన్న టీషర్ట్‌ను బహుమతిగా అందజేశారు.

కనుల పండువగా శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన పూర్ణాహుతి, ధ్వజారోహణము, మహా అన్నదాన కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్‌లు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరికి ఉండాలని, పాడి పంటలు సురక్షితంగా ఉంటూ, ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని కోరారు. ఆధ్యాత్మిక ప్రాంతంగా గోరంట్ల గ్రామం విరాజిల్లుతోందని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి పథంలో గోరంట్ల గ్రామం నడవాలని స్వామి వారిని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 20వేల మందికి పైగా భక్తులకు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచల మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, గొడుగులూరి సుబ్బారావు, యనుమళ్ళ నాగేశ్వరరావు, కోలా వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి సురేష్ పాల్గొన్నారు.

వేడుకగా అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం

హాజరైన ఆధ్యాత్మిక గురువు జీయర్ స్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు



అయోధ్య రామాలయం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రామానుజ జీయర్ స్వామి

నడిగడ్డవారిపాలెం(వేమూరు): ఆలయాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలని ప్రజలను భక్తి మార్గంలో నడిపించేందుకు ఎంతగానో దోహదపడతాయని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. చుండూరు మండలంలోని నడిగడ్డవారిపాలెంలో నూతనంగా నిర్మించిన అయోధ్య రామాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఆలయ నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల సహాయం అందజేసింది. చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి రూ.5లక్షల విరాళం అందజేశారు. నడిగడ్డవారిపాలెం గ్రామ సర్పంచ్ సునీత సురేష్ దేవస్థానంలో గ్రానైట్ ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధికి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు దంపతులు రూ.20వేల విరాళం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు మాట్లాడుతూ వసంత పంచమి రోజున రామాలయం ప్రారంభించడం అదృష్టమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో, సమరసత సేవా ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, మండల పార్టీ అధ్యక్షులు అనపు రెడ్డి రఘురామిరెడ్డి, గ్రామ సర్పంచ్‌లు విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరావు, వుయ్యూరి సుబ్బారెడ్డి, అంగిరెడ్డి నాగేశ్వరరావు, మంచికలపూడి దాసు, జొన్నకూటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, వెంకట రమణ, రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి



ఇంటింటి ప్రచారంలో భాగంగా మహిళలకు పార్టీ కరపత్రాలు అందజేస్తున్న డాక్టర్ ఈవూరి

రేపల్లె రూరల్: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీలో బుధవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తూ వేలాది కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి ఆంగ్ల మాధ్యమ బోధన అందాలనే ఉద్దేశ్యంతో ఆ దిశగా బోధన అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని బలపరిచి మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి, డాక్టర్ సృజన్, సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీటీసీ సభ్యులు అలివేలు మంగమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యానాదులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి



మాట్లాడుతున్న కూటమి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతి

కర్లపాలెం: యానాదులకు చట్ట సభలలో ప్రాతినిధ్యం కల్పించాలని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి కోరారు. బుధవారం కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో యానాది సంఘాల రాష్ట్ర మహాసభ నిర్వహించారు. వెంకటపతి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అయినప్పటికీ యానాదుల జీవితాలలో చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదన్నారు. యానాది సంఘాల మహాకూటమి అధికార ప్రతినిధి ఏకశిరి నరసింహారావు మాట్లాడుతూ యానాదులకు దామాషా ప్రకారం చట్ట సభలలో ఐదు శాసనసభ స్థానాలు, ఒక పార్లమెంటు స్థానంలో అవకాశం కల్పించాలని కోరారు. గిరిజన సలహా మండలిలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. మహా కూటమి చీఫ్ అడ్వైజర్ ఈగా శ్రీనివాసరావు, మహా కూటమి నాయకులు మాణికల ఏడుకొండలు, బెల్లంచర్ల ప్రసాద్, రావూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



శిబిరంలో మాట్లాడుతున్న సుబ్బారావు

బాపట్ల అర్బన్ : మహిళల రక్షణ చట్టాలు, హక్కులపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాపట్ల ఎన్జీవో హోంలో జిల్లాస్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఉసురుపాటి సుబ్బారావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను రక్షించుకునేందుకు చట్టాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి, గృహహింస వ్యతిరేక చట్టం గురించి వివరించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా కన్వీనర్ హేమలత మాట్లాడుతూ సమాజాభివృద్ధి మహిళలతోనే సాధ్యమన్న డాక్టర్ అంబేడ్కర్ మాటలను గుర్తు చేశారు. మహిళలు లేని సమాజాన్ని ఊహించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఆడపిల్లల పట్ల వివక్షత హేయమైన చర్య అన్నారు. సమాజంలో మహిళల పట్ల లైంగిక దాడులు పరిపాటిగా మారాయని, వీటిని నివారించేందుకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీబీఆర్సీ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, మెప్మా రిసోర్స్ పర్సన్ సరోజిని, రోజ్ సంస్థ ప్రతినిధి పొందుగుల ప్రసాదరావు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గుదె రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను అందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. ఎస్‌వీఆర్ కాలనీలోని సచివాలయం వద్ద బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు క్యాంప్‌లో పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు నివశించే ప్రాంతంలోనే వారికి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తుందని చెప్పారు. అన్ని రకాల వైద్య సేవలు, వ్యాది నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమార్ మాట్లాడుతూ జనరల్ ఓపీ -199, గైనికాలజీ-43, డెర్మటాలజీ -58, అప్తమాలజీ -108 మందికి పరీక్షలు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుట కోటయ్య, డాక్టర్ కుప్పా రాధిక, డాక్టర్ ముద్రకోల అనురాధ, డాక్టర్ సిహెచ్ దేవకి, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాల చంద్రమౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఎం ఆశీర్వాదం, దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.